## ఘనంగా శ్రీ వరదరాజస్వామి రథోత్సవం



కుప్పంరూరల్, మే 26 ప్రభాతవార్త
మున్సిపల్ పరిధి లక్ష్మీపురంలో వెలసిన శ్రీ ప్రసన్న వరదరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి రథోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో విశేషంగా అలంకరించిన స్వామివారి ఉత్సవ మూర్తులను రథంపై పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు రథం లాగేందుకు ఉత్సాహం చూపారు. ఈసందర్భంగా భక్తులకు పానకం, పెసరపప్పు, మజ్జిగలను దాతలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# అసంతృప్తులకు ...బైబై!!

### ఎన్నికల ఫలితాల అనంతరం
### తిరుపతిలో తెలుగుతమ్ముళ్ళకు ఉద్వాసన??

ప్రభాతవార్త-తిరుపతి:
"పెనంపైనుండి పొయ్యిలోపడిందనే"చందంగా తిరుపతి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో ఎన్నికల అనంతరం కొందరు నేతల పనితీరు, వ్యవహారశైలి తయారైంది. తొలినుండి పార్టీలో నామమాత్రంగా పనిచేస్తూ, పార్టీని భ్రష్టుపట్టించిన తెలుగుతమ్ముళ్ళను తప్పించాలని పార్టీ అధిష్టానం యోచిస్తున్నట్లు సమాచారం. వీరివల్ల పార్టీకి నష్టం జరుగుతుండటం తప్ప ఒరిగేదేమీ లేదని మండిపడుతున్నారు.ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలోనూ కొందరు నేతలు మొక్కుబడిగా పనిచేశారనే ఆరోపణలు ఇప్పటికే అధినేతకు చేరిందని కార్యకర్తలు చర్చించుకుంటు



న్నారు. ఈ నేపథ్యంలో ఫలితాలకు ముందే కొందరు నేతలు తప్పుకుంటారా?ఎన్నికల ఫలితాలు అనంతరం తప్పిస్తారా??అనేది హాట్‌టాఫిక్‌గా మారింది. తిరుపతిపై తొలినుండి అధినేత చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేశ్ కూడా ప్రత్యేక దృష్టి సారించారు. ఇక్కడ పార్టీకి అభిమానులు, ఓటుబ్యాంకు పటిష్టంగా ఉంది. తిరుపతిలో టిడిపి పోటీ కూడా చేయాలని కార్యాచరణ సిద్ధంచేసుకున్నా ఆఖరునిమిషంలో పార్టీలోని కొందరు పోటీ పడటం, ఏకంగా తమతమ బలాలను నిరూపించుకోవడం, పార్టీలో పనిచేయకపోయినా చివరకు టిక్కెట్ ఆశించి పార్టీని ఇరుకునపెట్టడం వంటివి అధినేతల ఆగ్రహానికి కారణమైంది. ఈ నేపథ్యంలో తిరుపతిలో తప్పనిసరి పరిస్థితుల్లో కూటమి తరపున జనసేన పార్టీకి మద్దతునిచ్చి పోటీలో నిలబెట్టారు. ఆ తరువాత తిరుపతిలో జరిగిన పరిణామాలు కూడా అధినేత నిశితంగా ఆరా తీసి నివేదికలు తెప్పించుకున్నారు. జనసేన పార్టీ అభ్యర్థిని ఖరారుచేసినా చివరి నిమిషం వరకు ముగ్గురునలుగురు నేతలు పోటీకి సిద్ధపడటం పార్టీకి నష్టం కలిగించడమేనని బాబు ఆగ్రహం వెలిబుచ్చారు. అందరూ కలసి పనిచేయాలని, జనసేన అభ్యర్థిని గెలిపించుకోవాలని ఆదేశించారు. చివరగా పోలింగ్‌కు రెండురోజుల ముందు తిరుపతిలో జరిగిన బహిరంగ సభలో కూడా టిడిపి నేతలు కొందరు అసహనంగానే వ్యవహరించినట్లు సమాచారం. పోలింగ్ రోజు కూడా కొందరు నేతలు ఏదో పైకి కలసి పనిచేస్తున్నామని డాంబికంగా ఉన్నా లోలోపల మాత్రం తమ వైఖరిని స్పష్టం చేశారనేది కార్యకర్తల్లో మింగుడుపడని విషయంగా మారింది. ఇప్పుడు పార్టీని బలోపేతం చేసుకుని తిరుపతిలో అభిమానులు,పార్టీ కార్యకర్తలను కాపాడుకోవడంపై మరింత కఠినంగా వ్యవహరించేందుకు అధినేత సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాల అనంతరం కొందరు అసంతృప్తి నేతలకు ఉద్వాసన తప్పదనేది పార్టీ శ్రేణుల్లో గుప్పుమంటోంది.

# పోస్టల్ బ్యాలెట్ గుబులు

### ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారని ప్రతిపక్షం ధీమా!
### అధికార పార్టీకి 40 శాతం ఓట్లు పడివుంటాయని వైకాపా ఆశలు
### మొత్తం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 17,385 - జిల్లాకు చెందిన 14,761 ఓట్లు, ఇతర జిల్లాలకు చెందిన 3,124 ఓట్లు
### ఓట్ల లెక్కింపు రోజున ఉదయం 8 గంటలకే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు

చిత్తూరు, మే 26 ప్రభాతవార్త:
సార్వత్రిక ఎన్నిక-2024 ఓట్ల లెక్కింపు సమయం దగ్గరపడుతుండటంతో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల్లో పోస్టల్ బ్యాలెట్ల ఓట్లపై గుబులు నెలకొంది. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరికి ఓటు వేశారనే విషయంపై ఇటు అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తుండటంతో ఈ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు గంపగుత్తగా ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు పడి వుంటాయని తెలుగుదేశం పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో ఉద్యోగులు తెలుగుదేశం పార్టీకి 80 శాతం కంటే ఎక్కువ ఓట్లు వేసి వుంటారని తెలుగుదేశం నాయకులు చర్చించుకుంటున్నారు. ఉద్యోగుల్లో ప్రభుత్వ వ్యతిరేక ఎంత వున్నప్పటికీ ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సైతం ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇవ్వడంతో ప్రభుత్వ ఉద్యోగుల్లో కనువిప్పు కల్గిందని ఈ మేరకు ప్రస్తుతం జరిగిన పోస్టల్ బ్యాలెట్‌లో 40 శాతం మేరకు ఓట్లు అధికార పార్టీకి ఉద్యోగులు వేసి వుంటారని వైకాపా నాయకులు విశ్వసిస్తున్నా రు. జిల్లాలో పోలైన పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన ఓట్లను ఇప్ప టికే అధికారులు కసరత్తు చేసి ఏ నియోజకవర్గానికి చెందిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఆ నియోజకవర్గ ఇవిఎంలు భద్రం చేసిన స్ట్రాంగ్ రూమ్స్‌కు తరలించి




వేశారు. ఓట్ల లెక్కింపు రోజున ఉదయం 8 గంటల నుండి ముందుగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కించనుండటంతో పోస్టల్ బ్యాలెట్‌లో ఉద్యోగులు ఏ పార్టీ వైపు మొగ్గు చూపారనే విషయంపై స్పష్టత రానుంది. జిల్లాలో 17,385 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో చిత్తూరు జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 14,761 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్ కాగా చిత్తూరు జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించడానికి వచ్చి ఇతర జిల్లాల్లో ఓట్లు వున్న వారి ఓట్లు 3,124 వున్నాయి. ఈ సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల పోలింగ్‌కు ఎలక్షన్ కమీషన్ అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతో గతంలో ఎన్నడు లేని విధంగా ఈ ఎన్నికల్లో ఎన్నికల విధుల్లో పాల్గొనడానికి వచ్చిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. చిత్తూరు జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తించడానికి వచ్చిన 15,554 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోగా ఇందులో 14,114 మంది ఉద్యో గులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకు న్నారు. 1,440 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించు కోలేదు. అలాగే అత్యవసర సేవా విభాగాలకు సంబంధించి 4,331 మంది సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోగా ఇందులో 3,302 మంది సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే 1,029 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోలేదు. జిల్లాలో మొత్తం 19,885 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకుని అందులో 17,416 మంది పోస్టల్ బ్యాలెట్ పొంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో మరో 2,469 మంది మాత్రం పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు మాత్రం చేసుకుని పోలింగ్‌కు దూరంగా వుండిపోయారు. ఎన్నడు లేని విధంగా ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడంతో వీరు ఏపార్టీకి ఓటు వేసి వుంటారనే చర్చ జోరుగా జరుగుతుంది.

## తిరుపతి జిల్లాలో పోస్టల్ బ్యాలట్ ఓటర్లకు ఊరట!

### ఎవరివైపు మొగ్గుచూపారనేది ఉత్కంఠ

*తిరుపతి, మే 26ప్రభాతవార్త:*
*13రోజుల క్రిందట జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పలురకాలుగా ఎన్నికల విధుల్లో భాగస్వాములైన ఉద్యోగులకు ఎన్నికల సంఘం కల్పించిన పోస్టల్ బ్యాలట్ ఓటు చెల్లుబాటుపై స్పష్టత రావడంతో ఉద్యోగుల్లో ఊరట కలిగిస్తోంది. ఎన్నికలు 13వతేదీ జరిగినా పోస్టల్ బ్యాలట్ ఓటింగ్ ఈనెల 5వతేదీ నుండి 9వతేదీ వరకు కొనసాగింది. తిరుపతి పార్లమెంట్ జిల్లాలో 19,503 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలట్‌రూపంలో వినియోగించుకోగలిగారు. ఇందుకు ఎన్నికల విధుల్లో పాల్గొనే వారందరికీ కల్పించిన అవకాశం,.అయితే ఇందులో కూడా చాలావరకు ఉద్యోగులైన ఓటర్లు పేర్లు గల్లంతయ్యాయని, ఓటరు జాబితాలో పేరు లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాలతో పోస్టల్ బ్యాలట్‌కు అర్హులైన ఉద్యోగులందరూ జాబితాలో పేరు లేకున్నా 13ఎ ఫారమ్ నింపి అక్కడికక్కడే రిటర్నింగ్ అధికారి సంతకం చేసి ఓటు హక్కుకు అవకాశం కల్పించారు. ఇలా చాలామంది ఐదురోజులపాటు కల్పించిన సదుపాయాన్ని వినియోగించుకున్నారు. అయితే కొంతమందికి సంబంధించి బ్యాలట్ పేపరు వెనుక రిటర్నింగ్ అధికారి సంతకం ఉన్నా సీల్ లేదని, ఓటరు నంబర్ వేయకున్నా చెల్లుబాటు కాదని చర్చ సాగింది. దీంతో ఉద్యోగులైన ఓటర్లు చాలావరకు తమ ఓటుపై సందిగ్ధత నెలకొంది. తాజాగా ఆదివారం ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలతో పోస్టల్ బ్యాలట్‌కు సంబంధించి ఓటరు సంతకం, రిటర్నింగ్ అధికారి సంతకం ఉంటే ఓటు చెల్లుతుందని తేల్చేశారు. సీల్ లేదని చెప్పడం సరికాదని వెల్లడించింది. దీంతో తిరుపతి జిల్లాలో వినియోగించుకున్న ఓటర్లలో దాదాపు అన్ని పోస్టల్ బ్యాలట్ ఓట్లు చెల్లుబాటవుతాయనే నమ్మకం కలుగుతోంది. ముఖ్యంగా ఎన్నికల విదుల్లో పాల్గొన్న పోలీసుశాఖ, రెవెన్యూశాఖ, వైద్యఆరోగ్యశాఖ, ప్రభుత్వ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, నగరపాలకసంస్థ అధికారులు, ఉద్యోగులు, సచివాలయం ఉద్యోగులు చివరకు మీడియా సిబ్బంది కూడా పోస్టల్ బ్యాలట్‌కు అర్హులయ్యారు. ఈ ఓట్లన్నీ జూన్ 4న తొలుత లెక్కింపు జరుగుతుంది. మరీ పోస్టల్ బ్యాలట్ ఓటర్లు ఏ పార్టీవైపు మొగ్గుచూపారనేది మాత్రం 9రోజులు ఉత్కంఠతే.*

స్వర్ణరథంపై

## అలరించిన విఘ్ననాధుడు

కాణిపాకం, మే 26 ప్రభాతవార్త:



కాణిపాకం వరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ఆదివారం రాత్రి అలంకార భూషితుడైన సిద్ది బుద్ది సమేత విఘ్ననాధుడు బంగారురథంపై ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులను అలరించారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకటహర చతుర్ధి రోజున స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు స్థానిక ఆస్థాన మండపంలో స్వామివారికి ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు దఫాలుగా సంకటహర చతుర్ధి వ్రతంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి స్వర్ణ రథోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిద్ది, బుద్ది సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి సర్వాంగ సుందర ంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాల నడుమ మిరమిట్లు గొలుపుతున్న అలంకరించిన స్వర్ణరథంపై వుంచి మరోమారు అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గణేష్ నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాడా వీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు,పండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

హనుమంతు, గజవాహనాలపై

## కల్యాణ వేంకటేశ్వరుని దివ్యస్వరూపం





నారాయణవనం, మే 26 ప్రభాతవార్త :
ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా బాసిల్లుతున్న నారాయణవనంలోని పద్మావతీదేవి సమేత కల్యాణ వే ంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి ఆరవ రోజు ఆదివారం ఉదయం హనుమంత వాహనంపై నగరవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి 7గంటలకు కల్యాణ వేంకటేశ్వరున్ని గజవాహనంపై అధిరోహించి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. భక్తులు అడుగడుగునా టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. అంతకుముందు ఉదయం ఆలయంలో సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొల్పారు. తర్వాత నిత్యకట్ల, మొదటి గంట, బేరితాడనము, తోమాలసేవ, శుద్ధి, నిర్వహించారు. అనంతరం హనుమంతు వాహనంపై అధిరోహించి మాడవీధి, మెయిన్‌రోడ్డు, కొత్తబజారువీధి, పాత బజారువీధి, ఎగువ, దిగువపద్మాశాలీ వీధి, తేరువీధుల్లో ఊరేగిన తర్వాత కల్యాణ వేంకటేశ్వరునికి ఘనంగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, నెయ్యి, కొబ్బరినీళ్లు, పశుపు వంటి సుగంధద్రవ్యాలతో స్నపనతిరుమంజనం చేయడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సాయంత్రం 5గంటల నుంచి గంటపాటు వసంత్సోవం ఘనంగా నిర్వహించారు. వసంతోత్సవం సందర్భంగా కల్యాణ వేంకటేశ్వరుడు మాడవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా అన్నమయ్య సంకీర్తలను వినిపించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి శ్రీవారి సేవలో పాల్గొని తరించారు. రాత్రి 9గంటలకు శ్రీవారు గజవాహనాన్ని అధిరోహించి నగరు వీధుల్లో ఊరేగారు.



చిత్తూరునగరంలో ఆదివారం పోలీసుల ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న దృశ్యం

## గంగ నీటికోసం రైతుల భగీరథ ప్రయత్నం

వెంకటగిరి టౌన్, మే 26, ప్రభాతవవార్త



పంటను రక్షించుకునేందుకు తెలుగు గంగ కోసం రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. వర్షాలు పడకపోవడంతో రైతులు పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. దుర్గం కాలంలో ఉన్న నీటిని విద్యుత్తు మోటార్లు, ఆయిల్ ఇంజన్లు, సైబర్ పద్దతి ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో రైతులు తెలుగుగంగ నీటిని పంటలకు వాడుకుంటున్నారు. ఎంతో వ్యాయ ప్రయాసలతో నీటిని పంటలకు అందిస్తున్నారు. కొందరు కొత్తగా కూడా పంటలను సాగుచేస్తున్నారు. వర్షాలు జాడ లేకపోవడంతో తెలుగు గంగ నీటి పై రైతులు ఆధారపడి పంటలను రక్షించుకుంటున్నారు. తెలుగు గంగ నీటి ద్వారా వేలాది ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు. వర్షాలు ఎప్పుడు పడతాయని రైతులు ఎదురుచూస్తున్నారు.

# చినుకు జాడ లేదు...అయినా సేద్యం ఆగేది లేదు..





చిట్టత్తూరు గ్రామం వద్ద వరినాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు - మరోవైపు వర్షంకోసం నిరీక్షిస్తున్న అన్నదాత

తొట్టంబేడు, మే 26 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి,సత్యవేడు నియోజకవర్గాలు దాన్యాగారాలుగా ఉన్నాయి. అయితే ఈ ప్రాంతాల్లో సుమారు 450 చెరువులున్నాయి. అన్ని రాజుల కాలంలో నిర్మించినవే. అయితే వాటి నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఉపాధి హామీ పథకంలో పనులు జరుగుతున్నట్లు రికా ర్డుల్లో నమోదౌతుంది. కానీ ఎక్కడ ఏం జరిగిందో ఏం జరుగుతుందో ముక్కంటీశునికే ఎరుక. అయితే సాధారణంగా ఈ ప్రాంతాల్లో ఈశాన్య రుతుపవనాల ద్వారా భారీ వర్షాలు కురుస్తాయి. గత రబీ సీజన్‌లో వాతావరణంలో మార్పులో లేక ప్రకృతి కక్ష బూనిందో కానీ 'రుతుపవనాల ద్వారా' వర్షాలు ప్రశ్నార్థకమయ్యాయి. కేవలం 'తుఫాన్లు, అల్పపీడనం'పైనే ఆధారపడి చెరువులు నింపుకునే దుస్తితి చోటు చేసుకుంది. ఈ ఏడాది వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఓవైపు ఎండలు మండుతున్నా ఖరీఫ్ మాసం ప్రారంభమైనా ఆకాశంలో మబ్బులే తప్ప చినుకు జాడ కానరావటం లేదు.ఉదయం ఆకాశం మేఘావృతం కావటం మంచుకురుస్తుంది. కానీ వర్షం కురవటం లేదు.ఇప్పటికే చెరువులన్నీ ఖాళీగా దర్శన మిస్తున్నాయి.ఇదే అదనుగా చెరువుల్లో మట్టిని తొలగిస్తున్నారు.

**వరుణుని కరుణ కోసం చెరువులు నిరీక్షణ**

శ్రీకాళహస్తి ఇరిగేషన్ సబ్‌డివిజన్‌లో 452 చెరువులున్నాయి. వీటి కింద సుమారు 32వేల హెక్టార్లలో పంటలు పండిస్తున్నారు. స్వర్ణ ముఖి నది కనీసం రెండు సార్లు పారాల్సి ఉంది.కానీ ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యమో ఏమో కాని ఇప్పటి వరకు స్వర్ణముఖి పార లేదు. చెరువులకు కనీసం నీటి ముఖం చూపలేదు.ఈ ప్రాంతాల్లో ఖరీఫ్ సీజన్ మే మొదటి వారం నుంచే ప్రారంభం అవుతుంది. అయితే ఈ ఏడాది వర్షాభావంతో అన్నదాతలు వరుణుని కరుణ కోసం ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు.నవంబర్‌మాసం సగం కావస్తున్నా సరైన వానలు లేకుంటే ఈ ఏడాది వ్యవసాయం ఎలా చేయాలనే మీమాంశలో కొట్టుమిట్టాడుతున్నారు.దుక్కులు దున్ను కున్న వారు విత్తనాలు వేసుకోవటానికి తటపటాయిస్తున్నారు.

**ఆగిన గంగ నీరు..**

తెలుగుగంగ కాలువలో నీరు కండలేరు నుంచి నిలపివేయడంతో అన్నదాతలు కష్టాలు ఎదుర్కొంటున్నారు.అంతేకాకుండా వరుణుడు కూడా కరుణించకపోవడంతో అలా వచ్చి ఇలా వెళ్తున్నాడు. దీంతో అన్నదాతలు బోర్లు, బావుల కింద ఉన్న పంటపొలాల్లోనే వరినాట్లు వేస్తున్నారు. మండలంలోని రామచంద్రాపురం, శివనాథపురం, చిట్టత్తూరు, బోనుపల్లి, కంచనపల్లి, పెద్దకనపర్తి, పొయ్య, పెద్దకన్నలి, లింగమనాయుడుపల్లి, చిన్నసింగమాల, పొయ్యకొత్తూరు గ్రామాల్లో ఇప్పటికే వరినాట్లు వేయగా, మరికొందరు వరినార్లు ఇంకా అలానే ఉన్నాయి. మరికొందరు శరవేగంగా అన్నదాతలు నాట్లువేస్తున్నారు.

**పెట్టుబడులు ఎక్కువ..వరుణుడు కరుణించాల్సిందే..సురేష్, చిట్టత్తూరు**

ఈఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల వరుణుడు కరుణించడం లేదని మరో వైపు తెలుగంగకాలువలో నీరు లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని చిట్టత్తూరు గ్రామానికి చెందిన అన్నదాత సురేష్ మాట్లాడుతూ రెండు ఎకరాల్లో వరిపైర్లు నాటుతున్నామని,మరో 8ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నట్లు తెలిపారు. ఎకరాకు పదివేల చొప్పునపెట్టుబడులు అవుతుందన్నారు.

## యువతిపై దాడి

గుడిపాల, మే 26 ప్రభాతవార్త:

మండల పరిధిలోని చిత్తపార గ్రామంకు చెందిన నందిని అనే యువతిపై అదే గ్రామంకు చెందిన విజ్జి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఎస్ఐ శ్రీనివాసరావు వివరాల మేరకు తమ వ్యవసాయ పొలం వద్దకు వచ్చిందని అకారణంతో చిత్తపార గ్రామంకు చెందిన నందిని అనే యువతిని వరుసకు పెద్దనాన్న కుమారుడైన విజ్జి అనే యువకుడు క్రికెట్ బ్యాట్‌తో తీవ్రంగా దాడి చేశాడన్నారు. నందికి తండ్రి లేకపోవడంతో తల్లితో కలిసి జీవిస్తుందని, దాడికి గురైన నందిని పోలీసులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## రామకుప్పం..89పెద్దూరులో ఎఎస్పీ ఆరిఫుల్లా బృందంచే కవాతు

రామకుప్పం, మే 26 ప్రభాతవార్త



మండలంలోని 89 పెద్దూరు, రామకుప్పం పట్టణంలో ఆదివారం రాత్రి చిత్తూరు ఎఎస్పీ ఆరిఫుల్లా అధ్వర్యంలో డిఎస్పీ శ్రీనాథ్, రూరల్ సిఐ ఈశ్వర్‌రెడ్డి తదితరులు పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలకు ఎవరూ విఘాతం కల్పించరాదన్నారు. ఎవరైనా అల్లర్లు, గొడవలు సృష్టిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు సహకరించాలన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వైకాపా నేతలపై పోలీసులకు ఫిర్యాదు

రామకుప్పం, మే 26 ప్రభాతవార్త

స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట తనను దుర్భాషలాడడడంతో పాటు అంతు చూస్తామని వైకాపా నేతలు హెచ్చరించారని వారిపై చర్యలు తీసుకోవాలని మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి తమ పార్టీ కార్యకర్తల్ని స్టేషన్‌కు తీసుకువచ్చారని తెలిసి తాను అక్కడకు రాగా 89 పెద్దూరుకు చెందిన వైకాపా నేతలువెంకటేష్, వెంకటరమణ, హేమకుమార్, జగదీష్‌లతో పాటు మరో ఇరవై మంది కార్యకర్తలు స్టేషన్‌లోకి చొచ్చుకురావడంతో పాటు తనను నీ అంతు చూస్తాం అని బెదిరించారన్నారు. అలాగే ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ గురించి సైతం దురుసుగా మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనపై దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## శ్రీ తిరుపతి గంగమ్మఆలయంలో ఘనంగా మరుపూజ

కుప్పం, మే 26 ప్రభాతవార్త



కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమాంబ అమ్మవారి ఆలయంలో ఆదివారం ఘనంగా మరుపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రసన్న శ్రీ తిరుపతి గంగమాంబ, శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ఛైర్మన్ కెఎ మంజునాథ్‌కుమార్, అర్చకులు సోముస్వామి, పూజారులు షణ్ముగం, బుజ్జి, మాజీ ఛైర్మన్ ఆర్ఆర్ రవి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నాటు సారా స్థావరాలపై దాడులు

-పెద్దఎత్తున ఊట ధ్వంసం

-కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

పుంగనూరు,మే 26 ప్రభాతవార్త :



పుంగనూరు-మదనపల్లి ప్రాంతాలకు తలనొప్పిగా పరిణమించిన సుగాలిమిట్ట నాటుసారా స్థావరాలపై పుంగనూరు పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈదాడులలో భారీగా నాటుసారా ఊటలు ధ్వంసం చేసి,వాటికి ఉపయోగించే పరికరణాలను స్వాధీనంచేసుకున్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరెడ్డి బృందానికి ఎన్నికల ఫలితాల నేపథ్యంలో నల్లగుట్లపల్లితాండా ప్రాంతాల పరిధిలో పెద్దఎత్తున నాటుసారా ఊటలు నిల్వలు చేశారని,వాటిని కాచేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం అందిందింది. దీంతో అప్రమత్తమైన సిఐ రాఘవరెడ్డి,తన ఎస్ఐలు సుబ్బారెడ్డి,మహ్మద్‌రఫీలతో పాటూ ఇరవై మంది కానిస్టేబుళ్ళతో ఏకకాలంలో గ్రామాన్ని చుట్టుముట్టి కార్నర్‌సెర్చ్ చేపట్టారు. దీంతో గ్రామాల్లో కాకుండా గ్రామానికి బయట గుట్టల్లో రహస్యంగా కాచేందుకు తయారుచేసిన సారాబట్టీలు ధ్వంసం చేశారు. కాచేందుకు సిద్ధంగా ఉంచిన వెయ్యిలీటర్ల ఎఫ్‌జె వాటర్‌తో పాటూ,ఇరవై ప్లాస్టిక్ డబ్బా లలో సిద్ధంటా ఉంచినస సారానీటిని ధ్వంసంచేశారు. ఆరు ఇనుపడ్రమ్ములను,సారా కాచే అతిపెద్ద అల్యూమినియం పాత్రలు మూడింటిని స్వాధీనంచేసుకున్నారు. ఈసందర్భంగా గ్రామంలో ప్రజలనుద్దేశించి సిఐ మాట్లాడుతూ నాటుసారా తయారీ చేపట్టవద్దని పలుమార్లు హెచ్చరించినా గ్రామస్తులు మానడం లేదని, దీనికి ప్రతిగా నిత్యం గ్రామాలలో నిఘా ఉంచి సారా తయారీను అరికట్టేందుకు,అరెస్టులు చేసి కేసులు నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కొత్తగా అమలులో వచ్చిన మోటార్‌వెహికల్ చట్టం గురించి వివరించారు.

## హరికృష్ణారెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి పుష్పాంజలి

పాకాల, మే 26, ప్రభాతవవార్త



చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం సామిరెడ్డి పల్లికి చెందిన మాజీ ఎంపిటిసి హరికృష్ణారెడ్డి ఈ నెల 18వ తేది ఆకస్మికంగా మృతి చెందిన విషయం విధితమే. ఆదివారం సోమిరెడ్డిపల్లిలో నివాసం వద్ద ఆయన దశదిన కర్మక్రియలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి, ఆయన కుమారుడు తుడా ఛైర్మన్, చంద్రగిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలు హాజరై చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని ఓదార్చారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సీనియర్ నాయకుడిగా హరికృష్ణారెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. చెవిరెడ్డి కుటుంబ సభ్యులతో పాటు స్థానిక పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని హరికృష్ణారెడ్డి చిత్ర పటానికి అంజలి ఘటించారు.

## వేసవి శిక్షణ శిబిరం పిల్లలకు పోటీలు

కుప్పం, మే 26 ప్రభాతవార్త

స్థానిక గ్రంథాలయ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరానికి హాజరవుతున్న పిల్లలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారిణి సత్యవాణి తెలిపారు. 6-10తరగతుల విద్యార్థులకు వ్యాసరచన, కథలు రాయడం, డ్రాయింగ్, పదశోధిని, శ్లోకాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు 9676124756నెంబరును సంప్రదించాలని కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అమ్మవారి దర్శనానికి క్యూకట్టిన భక్తజనం

బోయకొండ(చౌడేపల్లి), మే 26 ప్రభాతవార్త



శక్తిక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ ఆదివారం భక్తజన సంద్రమైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి దర్శనార్థం క్యూలైన్లలో యాత్రీకులు వేచివున్నారు. వేసవి సెలవులు ముగియనున్న సందర్భంగా రాష్ట్రం నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు తరలివచ్చారు. కొండ దినాన్ని పురష్కరించుకొని అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయాన్నే అమ్మవారికి విశేష అభిషేకం, అలంకరణ నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో అధికార, అర్చక, సిబ్బంది యాత్రీకులకు సేవలందించారు.

## సమిష్టి కృషితో పాఠశాల అభివృద్ధికి పాటుపడదాం

చౌడేపల్లి, మే 26 ప్రభాతవార్త



సమిష్టి కృషితో పాఠశాల అభివృద్ధికి పాటుపడదామని స్థానిక ఉన్నతపాఠశాల పూర్వపు విద్యార్థులు (2002-03) అన్నారు. ఆదివారం ఈ మేరకు పాఠశాల ప్రాంగణంలో పూర్వ పు విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. తొలుత విద్యనేర్పి న గురు వులను దుశ్శాలవాలతో ఘనంగా సన్మానించారు. గడచిన 20యేళ్ళ జ్ఞాపకాలను ఒకరినొకరు కలుసుకొని నెమరువేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో 2002-03 పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నదానానికి రూ. 5లక్షల విరాళం

బోయకొండ(చౌడేపల్లి), మే 26 ప్రభాతవార్త



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయంలో జరుగు తున్న అన్నదాన కార్యక్రమానికి దాత రూ. 5లక్షల విరా ళాన్ని అందించారు. ఆదివారం పరిపా లనా భవనంలో తిరుపతి బాలాజీ ఆల య ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్ర మౌళిలకు చెక్కు నందించాడు. దాత లకు అమ్మ వారిదర్శన భాగ్యం కల్పించి, పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## దేశం కార్యకర్తపై దాడి కేసులో వైకాపా నేతల అరెస్ట్

రామకుప్పం, మే 26 ప్రభాతవార్త

మండలంలోని 89 పెద్దూరు గ్రామంలో తెదేపా కార్యకర్త శేషాద్రిపై దాడి చేసిన కేసులో వైకాపా నేతలు మణికుమార్‌తో పాటు మరో ముగ్గుర్ని అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్సై సుమన్ తెలిపారు. మణికుమార్, గోవిందస్వామి, సంతోష్, శివకుమార్ అనే నిందితులను శనివారం రాత్రి నారాయణపురం తాండా వద్ద అరెస్ట్ చేసి ఆదివారం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించారన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## సోమిరెడ్డిని విమర్శించే స్థాయి మంత్రి కాకాణికి లేదు

మండల పార్టీ అధ్యక్షుడు చంద్రమౌళి రెడ్డి

వెంకటగిరి టౌన్, మే 26, ప్రభాతవార్త



మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని విమర్శించే మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి లేదని తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమౌళి రెడ్డి తెలిపారు. రేవ్ పార్టీలో మంత్రి స్టిక్కర్ కలిగిన కారు ఉందని దానికి సమాధానం చెప్పకుండా సోమిరెడ్డి విమర్శించడం సరికాద న్నారు. మంత్రికి రేవ్ పార్టీతో సంబం ధాలు ఉన్నాయని సోమిరెడ్డి ఆధారాలతో సహా నిరూపించాల ని తెలిపారు. సోమిరెడ్డి చల్ మోహన్ రెడ్డి లేనిపోని విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదు అన్నారు. మంత్రి కాకానికి ఓటమి తప్పదని చెప్పారు. సోమిరెడ్డి విమర్శిస్తే ప్రజలే కాకానికి తగిన బుద్ది చెప్పారని అన్నారు.

## ఫల సరుకులు పంపిణీ



గూడూరు, మే 26, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని బాలాజీ నగర్ ప్రాంతంలో ఉన్న ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఫల సరుకులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా పొణకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం పొణకా మల్లికార్జున రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ దాతలు సహకారంతో తమ సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టమన్నారు. దాతల సేవలు మరువలేనిదన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పదాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు కార్యవర్గ సభ్యులు రామ్మోహన్ రావు, టీచర్ మామదూరు రాధయ్య, ప్రభాకర్, రాము, శివ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో ముద్దాయిలు అరెస్టు

చిల్లకూరు, మే 26, ప్రభాతవార్త

చిల్లకూరు మండలంలోని ఇద్దరు ఎస్‌బిక్యూ స్టీల్ ఫ్యాక్టరీలో స్క్రాప్ మెటీరియల్‌ను దొంగతనం చేసుకొని ఆటోలో పోవుచుండగా చిల్లకూరు ఏఎస్ఐ సిరాజ్, సిబ్బంది వారిని ఉదయం 11 గంటలకు అరెస్టు చేసి ముద్దాయిలు నెల్లూరు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన తిరుమల వడివేలు (30), ఆరవ శేఖర్ (50) రిమార్‌కు పంపించారు. సుమారు 130000 సొత్తు స్వాదీనం చేసుకున్నారు.



కాణిపాకం వరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ఆదివారం సిద్ది, బుద్ది సమేత గణనాధుని ఉత్సవమూర్తులకు అలంకార మండపంలో ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న దృశ్యం

# ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలి



గూడూరు, మే 26, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ నందు గున్నం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ప్రతి నెల నాల్గవ ఆదివవారం సింహపూరి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గున్నం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన రెడ్డి కమ్యూనిటీ పేద కుటుంబాలకు నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా సింహపూరి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యుడు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని సింహపూరి రెడ్డి సంక్షేమ సంఘం ఆద్వర్యంలో క్రమం తప్పకుండా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. యువత సేవా కార్యక్రమాల పై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో దశరథ రామిరెడ్డి, సనత్ కుమార్ రెడ్డి, ప్రజేందర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, కృష్ణారెడ్డి, కిషోర్ రెడ్డి, అనిల్ రెడ్డి, శివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సుధీర్‌రెడ్డి గెలుపుకోసం పాదయాత్ర

తొట్టంబేడు, మే 26 ప్రభాతవార్త



నియోజకవర్గంలోని రేణిగుంట మండలంలోని తెలుగుదేశంపార్టీ నాయకులు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి గెలుపుకోసం రేణిగుంట మండలం నఉంచి శ్రీకాళహస్తి మీదుగా సూళ్ళూరుపేట చెంగాళమ్మ అమ్మవారిని దర్శనం చేసుకుని అలాగే వేనాడు దర్గాను దర్శించుకుని పాదయాత్ర ముగింపు చేశారు.ఈ సందర్భంగా శ్రీకాళహస్తికి చేరుకోగా శ్రీకాళహస్తి తెలుగుదేశంపార్టీ నాయకులు రాత్రి బస ఏర్పాటు చేసి వారికి సంఘీభావంగా తిరిగి ఉదయం నాలుగుగంటలకు శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం భిక్షాలగోపురం వద్ద కొబ్బరికాయలు కొట్టి తిరిగి శ్రీకాళహస్తి నుంచి బయలుదేరారు. వారితో పాటు 8కి.మీ నడచి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి షాకిరాలీ, వినయ్‌కుమార్, యూనిట్ ఇన్‌ఛార్జి సుధాకర్‌రెడ్డి, కెఎస్ఆర్.మునిరాజాయాదవ్, బాబురెడ్డి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు పంపిణీ

.శ్రీకాళహస్తి, మే 26 ప్రభాతవార్త



పట్టణంలోని నగరివీధిలో ఉన్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినెల నిత్యావసర సరుకులను పంపిణీచేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. 149వ నెల సేవా కార్యక్రమాలను హెల్పింగ్ హ్యాండ్స్ అధినేత మునీర్‌భాష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు పాల్గొని ప్రత్యేకప్రతిభావంతులకు నిత్యావసర సరుకులను పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 149నెలలుగా హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా తాము ప్రతినెల ప్రత్యేక ప్రతిభావంతులకునిత్యావసర సరుకులను పంపిణీచేస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పనిచేసుకోలేని ప్రత్యేక ప్రతిభావంతులకు ఏదైనా వ్యాపారం పెట్టించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే తమ లక్ష్యం అన్నారు. ప్రత్యేక ప్రతిభావంతుడు మురళీ మాట్లాడుతూ గత ఐదు సంవతసరాలుగా తనకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారని తనకు ఎంతో చేయూతనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కోళ్ళూరుహరనాధ్‌నాయుడు, బాబాఫరీద్, హెల్పింగ్‌హ్యాండ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీసి బస్టాండు వద్ద ముక్కుమూసుకోవాల్సిందే!

-కాలువల్లో పేరుకుపోయిన సిల్టు

-ఇబ్బందులు పడుతున్న దుకాణదారులు



శ్రీకాళహస్తి, మే 26 ప్రభాతవార్త

పన్నుల వసూళ్ళలో మాత్రం మున్సిపల్ అధికారులు ప్రజల, దుకాణదారుల నుంచి ముక్కుపిండి వసూళ్ళు చేస్తున్నారు. అయితే పారిశుద్యంతో విఫలం అవుతున్నారు. ఓవైపు బలరాం థియేటర్ ఎదురుగా ఓచెత్తకుప్పను ఏర్పాటుచేయడంతో ఇక్కడ దుర్వాసన భరించలేక దుకాణదారులు ఎదుర్కొంటున్నారు. ఇక ఆర్టీసి బస్టాండు వద్ద ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఉన్న కాలువల్లో సిల్టు తొలగించకపోవడంతో దుర్వాసన భరించలేక ముక్కులు మూసుకుని వ్యాపారాలు చేసుకోవాల్సి వస్తోంది. గత పదిరోజుల నుంచి ఈ మార్గంలో కాలువలు శుభ్రం చేయకపోవడంతో కాలువల్లో ఇష్టారాజ్యాంగా మురుగునీరు పేరుకుపోయి చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో పారిశుద్య కార్మికుల చేత శుభ్రం చేయించాల్సిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ నిమ్మకు నీరెత్తడంతో పాటు కనీసం ఈవైపు కన్నెత్తి కూడా చూసే పరిస్థితులు లేవు. ఆర్టీసి బస్టాండు ముందు హోటళ్ళు ఇతర దుకాణాలు ఉన్నాయి. ఎదురుగా కొన్ని ఎలక్ట్రికల్ దుకాణాలు, ఇతర దుకాణాలు కూడా ఉన్నాయి. అయితే కాలువపై దుకాణదారులు సిమెంటుదిమ్మెలు వేసుకోవడంతో కాలువల్లో సిల్టు తీయడానికి వీలులేకుండా పోతోంది. ఇకనైనా మున్సిపల్ అధికారులు కాలువపై ఉన్న సిమెంటు దిమ్మెలు తొలగించి కాలువలను పరిశుభ్రం చేయాలని కోరుతున్నారు. ఈ దుర్వాసనతో కొందరు ఆస్పత్రుల పాలైనట్లు తెలుస్తోంది. పురపాలక సంఘ అధికారులు స్పందించి కాలువలను పరిశుభ్రం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### మహారాష్ట్ర భక్తుల చొరవతో

# శివయ్య ఆలయ లీకేజీల మరమ్మతులు

### చక చకా పనులు: పరిశీలించిన చైర్మెన్



లీకేజీల పనులను పరిశీలించి సైట్ ఇంజనీర్లతో మాట్లాడుతున్న చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి,మే 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంంపై భాగంలో చినుకు పడితేచిత్తడిగా మారి వర్షాకాలం భక్తులు తీవ్ర ఇబ్బందుపడే వారు.ఈ సమస్యను గుర్తించిన పాలకులు మరమ్మత్తులకు బెంగుళూరుకు చెందిన నిపుణులతోనూ, చెన్నై,తిరుపతి ఐఐటి నిపుణులతో పరిశీలనలు జరిపారు. కొంత మేరకు పనులు నిర్వహించారు.కానీ సత్ఫలితాలనివ్వలేదు. దాంతో చైర్మెన్ శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చిన రింకు ఇంటర్నేషనల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ సంస్థకు చెందిన మేనేజ్మెంట్ నిర్వాహకులతో చర్చించారు. ధార్మిక భావాలు కల్గిన చైర్మెన్ తన సిబ్బందితో అంచనాలు కట్టించారు. సుమారు రూ.4కోట్లు అవుతుందని అంచనా వేసారు.ఈ పనులను దేవస్థానం నిధులతో కాకుండా రింకుసంస్థ స్వచ్ఛందంగా నిర్వహించుటకు అనుమతించాలని అభ్యర్థించారు. పనులను ఆ సంస్థకు అప్పగించారు. వేసవి కాలం కాబట్టి పనులకు అనుకూలంగా ఉంటుందని రింకు సంస్థ పనులు చేపట్టింది.ఈ పనులను ఆదివారం ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు.మహారాష్ట్రకు చెందిన రింకు సంస్థ దాతగా చేపట్టిన పనులు పురాతన ఆలయాన్ని పురాతన పద్దతిలోనే నేచురల్ మెటిరియల్స్ వినియోగించి లీకేజీలను అరికట్టేందుకు ప్రయత్నించటం పట్ల పలువురు హర్షం ప్రకటించారు.

**దశాబ్దంగా వెంటాడుతున్న సమస్య:**

శ్రీకాళహస్తీశ్వరాలయం 11 శతాబ్దం నాటిదని చెబుతారు.అయితే 1906లో చెన్నైకు చెందిన నాటుకోటు చెట్టియార్లు మరమ్మత్తులు చేయించారు.సుమారు గత పదిసంవత్సరాలుగా లీకేజీల సమస్య వేదిస్తుంది. అధికారులు ఎన్నో ప్రయత్నాలు చేసినా ప్రయోజనం లేకపోయింది. వర్షాకాలం ఆలయం జారుడుబండలా మారుతుంది. ఆలయం పైభాగంలో ఏర్పడ్డ కంటికి కనబడని పగుళ్ళ ద్వారా వర్షా కాలం వర్షపు నీరు ఆలయంలోకి లీకేజి అవుతుంది. ప్రధానంగా అమ్మవారి ఆలయం పరిసరాలు చిత్తడిగా మారుతున్నాయి.భక్తకన్నప్ప కొండవైపు నుంచి లీకేజిలు,సిపేజీలు అధికంగా వచ్చేది. దేవాదాయశాఖ ఇంజనీర్లు, చెన్నై ఐఐటి నిపుణులు, ఇతర రాష్ట్రాల్లోని నిపుణులు పలుమార్లు పరిశీలించారు. ప్రయత్నాలు చేసారు.కానీ ఫలితాల్లేదు. గతంలో శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చిన రింకు ఇంటర్నేషనల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ యజమానులు ఆలయంలో లోపల లీకేజీ సమస్యను తెలుసుకున్నారు. తమ సంస్థ ద్వారా చేపడతామని ముందుకు వచ్చారు. ఈ పనులను పురాతన కాలం నాటి ఆలయాలకు ఉపయోగించే సహజ సిద్ధమైన మెటిరియల్స్‌తో చేపట్టటానికి ముందుకు వచ్చారు. జరుగుతున్న పనులను శనివారం ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. చేపట్టిన పనుల వివరాలను వాడుతున్న మెటీరియల్స్‌కు సంబంధించి ఆయన సైట్ ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు.శ్రీకాళహస్తీశ్వరుని పనులు చేపట్టడంలో దాతల ధాతృత్వం అభినందనీయం అన్నారు. ఆలయంలో వాహనాలను బంగారు మయం చేయటానికి నెల్లూరుకు చెందిన వేమిరెడ్డి కుటుంబం ముందుకు రాగా 1516లొ శ్రీకృష్ణదేవరాయలచే నిర్మించిన రాజగోపురం కూలిపోగా పునర్నిర్మాణ పనులను నవయుగ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన చింతా విశ్వేశ్వరావు రూ.65కోట్లతో చేపట్టారని నేడు లీకేజీల నివారణకు మహారాష్ట్రకు చెందిన రింకు సంస్థ ముందుకు రావటం అభినందనీయం అని చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు.

## సమాజ పోకడలను తెలుసుకొని ఎదగటానికి చదరంగం సూచిస్తుంది : షామిలి



శ్రీకాళహస్తి,మే 26 ప్రభాతవార్త

నేడు సమాజంలో చోటు చేసుకున్న పోకడలను ఎప్పటి కప్పుడు తెలుసుకుంటూ మనం ఎలా ఎదగాలనే అంశాన్ని అవగాహన కల్పించేందుకు చదరంగం సాధన ఎంతో ఉపయోగపడుతుందని సీనియర్ చెస్ క్రీడాకారిణి షేక్ షామిలి అన్నారు. చిల్డ్రన్స్ అసోసియేషన్ సారధ్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ శిక్షణ కార్యక్రమాలకు ఆదివారం షామిలి ముఖ్యఅతిధిగా వచ్చారు.ఈ సందర్భంగా చిన్నారులకు దిశ దెశ నిర్దేశం చేస్తూ తాను ఓ సామాన్య కుటుంబంలో జన్మించానన్నారు. తన తల్లిదండ్రులు తనను చదువులోనూ, చదరంగం క్రీడల్లో ఎంతో ప్రోత్సహించారన్నారు. స్వర్గీయ మాజీ శాప్ చైర్మెన్ పిఆర్‌మోహన్ తనను రాష్ట్ర స్థాయి క్రీడాకారిణిగా గుర్తింపు తెచ్చుటకు పోటీలకు ప్రోత్సహించారన్నారు. చదరంగం అనేది నాడు రాజులు ఆడే ఆట అన్నారు. ప్రత్యర్ధుల ఎత్తులు, జిత్తులను ఎలా చిత్తు చేయాలనే అంశాన్ని చదరంగంలో మనకు అవగాహన కల్గుతుందన్నారు. అలాంటి చదరంగం క్రీడలకు సంబంధించి శ్రీకాళహస్తిలో సుమారు 30 సంవత్సరాలుగా రిటైర్డ్ అధ్యాపకులు సురేష్ చిన్నారులకు శిక్షణ ఇవ్వటం రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలకు తీసుకెళ్ళటం జరుగుతుందన్నారు.ఆయన సేవలు అభినందనీయం అన్నారు.తనకు సమాజంలో ఓ మంచి గుర్తింపు రావటానికి చదరంగం పోటీలు కూడా దోహదపడ్డాయన్నారు. చదువుతో పాటు ఏదో క్రీడల్లో యువత రాణించాలన్నారు. అందుకు తల్లిదండ్రులు ఒక్క చదువులోనే కాకుండా చదరంగం లాంటి క్రీడల్లో కూడా ప్రోత్సహించాలన్నారు.తాను తన చిన్నారి కుమార్తెను కూడా నేడు ఇక్కడ శిక్షణకు పంపుతున్నానని వివరించారు.ఈ కార్యక్రమాల్లో సురేష్, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## గోల్డెన్ ఇండియా బాడీ బిల్డింగ్ ఫెడరేషన్

### జాతీయ అధ్యక్షులుగా డా. ఎలమంచిలి ప్రవీణ్ నియామకం



తిరుపతి విద్య, మే 26, ప్రభాతవార్త

గోల్డెన్ ఇండియా బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులుగా డా. ఎలమంచిలి ప్రవీణ్‌ను నియమించారు. ఆదివారం స్థానిక ఆర్చిడ్ విస్టా హోటల్‌లో గోల్డెన్ ఇండియా బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ సర్వ సభ్య సమావేశం, ఎన్నికలు నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశానికి ఎన్నికలు పరిశీలకులుగా మస్కట్ దేశం నుండి షకీల్ సలాకట్ విచ్చేసారు. గోల్డెన్ ఇండియా బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులుగా డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ (ఆంధ్రప్రదేశ్), ప్రధాన కార్యదర్శిగా విజి బాబు (కేరళ), కోశాధికారిగా జై కుమార్ (కేరళ), ఉపాధ్యక్షులుగా తన్వీనర్ ఖాన్ (ఉత్తరప్రదేశ్), అనైసోని (మహారాష్ట్ర), టి.శేఖర్, షకీల్, సహ కార్యదర్శులుగా పంకజ్ త్యాగి (ఉత్తరప్రదేశ్), వినోద్ (బెంగాల్), మహేష్ శర్మ (రాజస్థాన్), యూనిస్ భాష ( ఆంధ్రప్రదేశ్), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జోష్ పొల్యాష (కర్నాటక), సురేష్ శర్మ(మధ్యప్రదేశ్), సతీష్ (పాండిచ్చేరి), శేఖర్ (హర్యానా), అసోసియేట్ కార్యదర్శిగా అనురాగ్ చౌదరి (ఉత్తరకాండ్), చీఫ్ క్యాపిటల్‌గా సుభాష్ బదనా (ఢిల్లీ), ఎగ్జిక్యూటివ్ నెంబర్లుగా యోగేష్ (నాగపూర్), ఇర్ఫాన్ (ఒరిస్సా), ప్యాట్రన్‌గా ఈశ్వర ప్రకాష్ (ఆంధ్రప్రదేశ్), చైర్మన్‌గా మోహన్ సింగ్ రాథోడ్ (మధ్యప్రదేశ్) తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన జాతీయ అధ్యక్షులు ప్రవీణ్ మాట్లాడుతూ ఇప్పటివరకు దాదాపు 206 ఆర్గనైజేషన్‌లో సేవ చేసే బాగ్యం బిల్డింగ్ అసోసియేషన్ కార్యవర్గం తనను ఎన్నుకోవడం ఎంతో ఆనందంగా ఉందాలని ఈ నాలుగు సంవత్సరాలలో భారతదేశం నలుమూలల కార్యక్రమాలు విస్తృతంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

## భక్తి శ్రద్ధలతో ఘనంగా ఎల్లమ్మ భక్తుల అగ్నిగుండ ప్రవేశం

నారాయణవనం, మే 26 ప్రభాతవార్త :

మండలంలోని భీమునిచెరువు గ్రామంలో కొలువుదీరిన ఎల్లమ్మ తల్లి అమ్మవారి వార్షిక తిరునాళ్లలో భాగ ంగా ఆదివారం సాయంత్రం 6గంటలకు కంకణం ధరించిన సుమారు 100 మంది భక్తులు గోవింద నామస్మరణతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఐదు రోజుల క్రితం మొక్కుబడి కలిగిన భక్తులు కంకణం ధరించారు. మహిళా భక్తులు ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున పొంగళ్లను పెట్టారు. రాత్రి అమ్మవారిని సింహవాహనంపై అధిరోహించి పుష్పాలతో సుమనోహరంగా అలంకరించిన తర్వాత ట్రాక్టర్‌పై గ్రామవీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భాణసంచావేడుకల నడుమ ఘనంగా ఊరేగించారు. భక్తులు అడుగడుగునా టెంకాయహారతులు పట్టారు. అంతకుముందు ఉదయం 9 గంటలకు మొక్కుబడి కలిగిన యువకులు శరీరానికి ముళ్లుగుచ్చుకొని ఆటోపై వ్రేలాడారు. ఈ విన్యాసాన్ని తిలకించడానికి చుట్టుపక్క గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొని వీక్షించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు నారాయణవనం జడ్పీటీసీ సభ్యులు, జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, కుటుంబసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆరణి జోలికొస్తే ఊరుకోం

### బలిజసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్

తిరుపతి హెల్త్, మే 26, ప్రభాతవార్త



ఆరణి జోలికొస్తే ఊరుకోమని బలిజసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బలిజ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ జనసేన ఎమ్మెల్యే అభ్యర్ధి ఆరణి శ్రీనివాసులకు భద్రత పెంచారని చెప్పారు. పోలింగ్ రోజు, తరువాత జరిగిన హింసాత్మక ఘటనలతో భద్రత పెంపుకు ఈసిని ఆరణి శ్రీనివాసులు కోరగా హైకోర్టు సూచనలతో పోలీసులు భద్రత పెంచారని ఆయన తెలిపారు. ఆరణి భద్రత పెంపుకు గతంలో ప్రస్తుత తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి వైఖరే కారణమన్నారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ అధ్యక్షులు చిరంజీవి తిరుపతిలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన సమయంలో పోలింగ్ రోజు భూమన కరుణాకర్ రెడ్డి చేసిన దౌర్జన్యం ఇంకా ఎవరు మరిచిపోలేదన్నారు. గతంలో వైఎస్ కుటుంబీకులు తిరుపతిలో దివంగత మాజీ ఎమ్మెల్యే వెంకటరమణని కిడ్నాప్ చేసి దౌర్జన్యం చేస్తే ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించిన విషయం అందరికి తెలుసని ఆయన చెప్పారు.ఆరణి శ్రీనివాసులకు ఏదైనా హాని తలపెడితే గ్రేటర్ రాయలసీమ పరిధిలోని కాపు, బలిజలంతా ఏకమై అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బలిజసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, బలిజ సేన నాయకులు బెల్లంకొండ సురేష్, బండ్ల లక్ష్మీపతి, చెరుకుల నీలాద్రి, గుండాల వేణురాయల్, బాసికర్ల రఘు తదితరులు పాల్గొన్నారు.

## జీఎం పురం ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ వితరణ

విజయపురం, మే 26 ప్రభాతవార్త:



జీఎం పురం ఉన్నత పాఠశాలకు 1997-2022 విద్యాసంవత్సరం చదువుకున్న పూర్వ విద్యార్థులు కంప్యూటర్‌ను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఉమాశంకర్‌కు ఆదివారం వితరణగా అందించారు. గత వారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాఠశాలకు సాంకేతిక పరికరాలు అందించాలని నిర్ణయించామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక సదుపాయం కల్పించడం ఆనందంగా ఉందని మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రకాష్, ఢిల్లీ, ఢిల్లీబాబు, సురేష్, భారతి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఆలయ అష్ట బంధన, కుంభాభిషేకం

విజయపురం, మే 26 ప్రభాతవార్త:



మండలంలోని జంబాడ ఆది ఆంధ్ర వాడలో నూతనంగా నిర్మించిన మాతమ్మ ఆలయ అష్టబంధన, మహ కుంభాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత రెండు రోజులుగా గ్రామస్థుల ఆధ్వర్యంలో పురోహితులు నూతనంగా నిర్మించిన మాతమ్మ దేవత ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు చేశారు.

## శ్రీ బాలాజీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులుగా శేఖర్

తిరుపతి విద్య, మే 26, ప్రభాతవార్త



శ్రీ బాలాజీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులుగా మల్లకుప్పం శేఖర్ నియమితులైయ్యారు. ఆదివారం కొర్లగుంట యూనియన్ కార్యాలయం నందు అధ్యక్షులు మునికృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మిగిలిన కమిటీ సభ్యులను జూన్ 2వ తేది జరిగే సమావేశంలో ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

వడమాలపేట, మే 26 ప్రభాతవార్త:



వడమాలపేట మండల పరిధిలోని పాదిరేడు బైపాస్ రోడ్డు వద్ద మోటారు బైక్‌ను కంటైనర్ ఢీ కొనడంతో తమిళనాడుకు చెందిన మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. తమిళనాడు తిరువళ్లూరు జిల్లా, పొన్నేరుకు చెందిన ప్రజ్ఞ(35) ప్రమాదంలో మృతి చెందిం ది. శనివారం వెంకటేశ్వర స్వామి దర్శనార్థం పొన్నేరికి చెందిన విజయకాంత్, ప్రజ్ఞ దంపతులు తిరుమలకు వచ్చారు. శ్రీవారిని దర్శించి ఆదివారం సాయంత్రం స్వగ్రామానికి వెళుతుండగా పాదిరేడు బైపాస్ రోడ్డు వద్ద వెనుక వస్తున్న కంటైనర్ ఢీకొంది. దీంతో అదుపు తప్పి మోటారు బైక్ బోల్తా పడడంతో ప్రజ్ఞ అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కంటైనర్ డ్రైవర్ అజితను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు.

## ఆరణికి ఏదైనా జరిగితే భూమనదే బాధ్యత

శ్రీకాళహస్తి,మే 26 ప్రభాతవార్త

తిరుపతిలో జనసేన తరఫున పోటీ చేసిన ఆరణి శ్రీనివాసులుకు ఏదైనా జిరిగితే భూమన కుటుంబానిదే బాధ్యత అని కాపుసంక్షేమ సేన నాయకులు అరిగెల వేణుగోపాల్ అన్నారు. ఆదివారం ఆయన శ్రీకాళహస్తిలో మీడియాతో మాట్లాడుతూ భారత దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా నేడు ఆంధ్ర రాష్ట్రంలో చోటు చేసుకుందన్నారు. రాజకీయాల్లో ప్రజా తీర్పుకు కట్టుబడి ఉండాల్సిన నాయకులు ఎందుకో పోలింగ్ తరువాత విధ్వంస కార్యక్రమాలకు పాల్పడుతున్నారని వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. తిరుపతి ప్రజలు ఆరణి శ్రీనివాసులుకు పట్టం కట్టనున్నారని తెలుసుకున్న భూమన కుటుంబం ఓర్వలేక కౌంటింగ్ సందర్భంగా గోడవలు చేసేందుకు కుట్రలు కుతంత్రాలు పన్నుతున్నారని విమర్శించారు. ప్రజల మనిషిగా చిత్తూరులో గన్‌మెన్‌ల సహాయం లేకుండా తిరిగిన జన నాయకుడు ఆరణి శ్రీనివాసులు నేడు తిరుపతిలో పోలీసుల భద్రత మధ్య తిరిగే దుస్థితి చోటు చేసుకుందని వేణుగోపాల్ అన్నారు. గ్రేటర్ రాయలసీమలో జనసేన తరఫున పోటీ చేసిన ఏకైక బలిజ సామాజిక వర్గానికి చెందిన ఎంఎల్ఏ అభ్యర్ధి అన్నారు. అరణి శ్రీనివాసులుకు ఏదైనా జరిగితే భూమనకుటుంబం బాధ్యత వహించాల్సి ఉంటుందని వివరించారు.

# తిరుపతి డివిజన్

## వైభవంగా సంకటహార చతుర్థి

పుత్తూరురూరల్, మే 26 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణం మండల పరిధిలోని పలు శ్రీ వినాయకస్వామి ఆలయాల్లో శనివారం సంకటహార చతుర్థి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బెస్తవీధిలో వెలసిన శ్రీ తరుణ గణపతి ఆలయంలో ఉదయం మూల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. సాయంత్రం ఆలయంలో గణపతి పూజ కలస్థాపన గణపతి హోమం, అలాగే ఆలయంలో సూర్య భగవానుడికి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు, అలంకరణలు చేశారు. జెండామాను వీధిలో వెలసిన వినాయకస్వామి ఆలయం, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలోని వినాయక స్వామికి మండల పరిధిలోని తొరూరు గ్రామంలో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## గంగమ్మగుడిలో హుండీ చోరీ

పుత్తూరురూరల్, మే 26 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని బజారువీధిలో వెలసిన శ్రీ పిడికిలి గంగమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తాళాలు పగులగొట్టి హుండీ తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు పోలీసులు గస్తీ పెంచాలని కోరుతున్నారు. గంగ జాతర కమిటీ వారు పుత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## జాడలేని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు

కేవీబీ పురం, మే 26 ప్రభాతవార్త:

మండలంలో ప్రతినెల జరగవలసిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ, పౌర హక్కుల సమావేశాలు కేవీబీ పురం మండలంలో జాడే లేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూరిపాకు వాసుదేవరావు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవీబీ పురం మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో జస్టిస్ పున్నయ్య కమిటీ ఆదేశాల మేరకు ప్రతి నెల ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ, పౌర హక్కుల సమావేశాలు నిర్వహించి ఎస్సీ, ఎస్టీల ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడం కొరకే పున్నయ్య కమిటీ ఈ నివేదికను తీసుకొచ్చిందని తెలిపారు. అయితే మండలంలో ఇప్పటి వరకు సుమారు సంవత్సర కాలంగా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ, పౌర హక్కుల సమావేశాలు జరగడం లేదని ఆరోపించారు. మరి ముఖ్యంగా గత సమావేశంలో దిగువ పుత్తూరు గ్రామంలో దళితులకు శ్మశాన వాటికకు దారి లేదని ఆ సమస్యను పరిష్కరించాలని మానిటరింగ్ కమిటీలో తెలియజేసినా ఇంత వరకు పరిష్కరించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ, పౌర హక్కుల సమావేశాల్లో ఏవైనా సమస్యలు తెలియజేసిన 30 రోజుల్లోనే ఆ సమస్యను పరిష్కరించే విధంగా చట్టం ఉందని అధికారులు గుర్తించి ఎస్సీ, ఎస్టీ ప్రజలకు అండగా నిలవాలని కోరారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నత స్థాయి అధికారులు స్పందించి మండలంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ, పౌర హక్కుల సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించి ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించాలని వాసుదేవరావు కోరారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : సీఐ మల్లికార్జున్

రేణిగుంట, మే 26 ప్రభాతవార్త:



ఎన్నికల కమిషన్ విధించిన నియమ నిబంధనలను ఉల్లం ఘిస్తే జిల్లా ఎస్పీ హర్షవర్ధ న్‌రాజు ఆదేశాలు, డీఎస్పీ భవ్యకిషోర్ సూచనల మేరకు చర్యలు కఠినంగా తీసుకుంటా మని రేణిగుంట అర్బన్ సీఐ మల్లికార్జున్ హెచ్చరించారు. రేణిగుంట మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డితో కలసి ప్రజలకు ధైర్యం కల్పించడం కోసం ఆదివారం కేంద్ర పారా మిలటరీ బలగాలతో కవాతు(ఫ్లాగ్ మార్చ్) నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు జరిగిన రోజు గొడవలు జరిగిన దృష్ట్యా కౌంటింగ్ రోజు అల్లర్లు జరగకుండా మండలంలోని సుబ్బయ్యగుంట, మల్లవరం, కృష్ణాపురం గ్రామాల్లో కవాతు నిర్వహించి ప్రజలకు ధైర్యాన్ని చెప్పారు. తామున్నామని భరోసా ఇస్తూ అల్లర్లు దొరక్కుండా నిరోధిస్తామన్నారు. ఎవరైనా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుంటే తమ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారని హెచ్చరించారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరగడానికి అందరూ సహకరించాలన్నారు.

## రాస్‌లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

రేణిగుంట, మే 26 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ ఇందిరానగర్ రాష్ట్రీయ సేవా సమితి కార్యాలయంలో ఆదివారం రాస్‌ప్రధాన కార్యదర్శి డా. వెంకటరత్నం ఆదేశాల మేరకు, పొదుపు సంఘాల సంచాలకులు వి.నాగరాజు సూచనలతో రాస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి దివంగత పద్మశ్రీ గుత్తా మునిరత్నం ఆశయ సాధనలో భాగంగా శనివారం శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి అరవింద ఆస్పత్రి కంటి వైద్యులు అనిత బృందం వైద్య పరీక్ష నిర్వహించి 50 మందికి కంటి ఆపరేషన్ల అవసరం ఉన్నట్లు గుర్తించారు. అవసరమైన వారికి శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి వైద్యశాల ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌రెడ్డి, శైలజ, భారతి, లీలా ప్రసాద్, బాలకృష్ణ, మోహన్, వెంకటేష్, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెట్టుబడి లేని వ్యాపారం మట్టి అమ్మకాలు

సత్యవేడు, మే 26 ప్రభాతవార్త:



సత్యవేడు మండల పరిధిలో కేవలం ఒకరి, ఇద్దరు అధికారులను మన వైపు మళ్లించుకుంటే(మామూలు ఇచ్చి) చాలు ఒక్క రాత్రికి ఏకంగా 75 వేలు, ఒక్క పగలు చెరువు నుంచి ట్రాక్టర్ ద్వారా మట్టిని తరలిస్తే 1.50 లక్షలు సులువుగా జేబులో వేసుకోవచ్చు. ఇది సత్యవేడు మండలంలో మట్టి అమ్మకాల ఆదాయాలు, తెలుగు గంగ మట్టి, చెరువుల్లో బంక మట్టి, మేత బీడు భూముల్లో ఉన్న గులక మన్ను యథేచ్ఛగా తరలిస్తున్న సత్యవేడు మండలంలో రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖ అధికారులు, తెలుగు గంగ అధికారులు, కళ్ళకు గంతలు కట్టుకోవడం పరిపాటిగా చెప్పవచ్చు. కొల్లడం గ్రామం శ్రీసిటీ పరిధికి ఆనుకుని ఉన్న అక్కడ చెరువులో మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. మేము ఎన్నికల కోసం వచ్చాము...మాకెందుకు ఈ అక్రమ రవాణాపై చర్యలు అనే విధంగా అధికారులు వ్యవహరించడం పట్ల పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# కాణిపాకంలో కొనసాగుతున్న వేసవి రద్దీ



## ఆలయం వెలుపల బారులు తీరిన భక్తులు

కాణిపాకం, మే 26 ప్రభాతవార్త:

సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. పాఠశాలలు, విద్యాసంస్థలకు వేసవి సెలవులు మరి కొద్ది రోజుల్లో ముగియనుండడంతో వివిధ ప్రాంతాల నుండి అనూహ్యంగా తరలివస్తున్న భక్తజనంతో ఆలయంలో గత ఐదారు రోజులుగా తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. అలాగే ఆదివారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో పాటు సంకటహర చతుర్థి కావడం, తిరుమల వెళ్ళే భక్తులు కూడా అధిక సంఖ్యలో కాణిపాకం స్వామివారి దర్శనార్థం తరలివస్తుండడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ ప్రాంతాల నుండి భక్తులు అనూహ్యంగా తరలిరావడంతో కాణిపాకం శ్రీవరసిది ద వినాయక స్వామి అలయం రద్దీతో కిటకిటలాడింది. ఆలయంలోని క్యూలైన్లు, క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండిపోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి గంటల తరబడి నిలబడాల్సి వచ్చింది. ఉదయం నుండి రాత్రి వరకు ఆలయంలోని క్యూలైన్లన్నీ భక్తులతో పోటెత్తింది. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్ధితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో సుమారు మూడు నాలుగు గంటల పాటు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది.

## ఘనంగా శ్రీ బాటగంగమ్మ విశ్వరూప దర్శనం

### భారీగా హాజరైన భక్తులు,అమ్మవారికి ప్రత్యేక పూజలు



పెద్దపంజాణి మే 26 ప్రభాతవార :

మండలంలోని కోగిలేరు పంచాయతీ బసవరాజుకండ్రిగ గ్రామంలో గ్రామదేవత శ్రీ బాటగంగమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆదివారం ఉధయం అమ్మవారు విశ్వరూప దర్శనంతో భక్తులకు దర్శన మిచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీ ప్రజలేకాక చుట్టుప్రక్కల గ్రామాలనుంచి సైతం భక్తులు అధికసంఖ్యలోవిచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కుకున్న భక్తులు జంతుబలులు ఇచ్చి తమమొక్కుబడులను చెల్లించుకున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి దీపారాధన నిర్వహించారు. కాగా శనివారం రాత్రి అమ్మవారి శిరస్సును పురవీధుల్లో ఘణంగా ఊరేగించారు. ఈ కార్యక్రమాలకు సైతం భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యా రు. కాగా అమ్మవారి శిరస్సు ఊరేగింపు సందర్భంగా ఎన్నికలకోడ్ అమలులో ఉండటటంతో బాణాసంచాకాల్పులను, డిజే కార్యక్రమాలను పోలీసులు నిషేదించారు. సంప్రదాయరీతిలో అమ్మవారి శిరస్సును ఊరేగించడం జరిగింది. సోమవారం ఉదయం అమ్మవారి జలధికార్యక్రమాలతో శ్రీ బాటగంగమ్మజాతర ఉత్సవాలు ముగియనున్నాయి.

## కన్నుల పండువగా పల్లకి సేవ



శ్రీకాళహస్తి రూరల్,మే 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఊరందూరు గ్రామంలోని శ్రీదేవి,భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కన్నుల పండువగా పల్లకి సేవను నిర్వహించారు. ఈ ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించుటకు ఆలయ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఓ ఎస్వి నాగేశ్వరరావు చిన్న ఆలయాల ఇన్చార్జి లక్ష్మయ్యకు ఆదేశించారు. దాంతో బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక కళ తెచ్చారు. ప్రతి రోజూ స్వామి అమ్మవార్లకు ఆలయంలో విశేష పూజలు,అభిషేకాలు గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం స్వామి అమ్మవార్లకు ఆలయంలోని అలంకార మండపంలో విశేష అలంకారాలను నిర్వహిస్తున్నారు. ఇందుకు ప్రత్యేంగా అర్చకులను నియమించారు. ఇక ఉత్సవాలను చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆకట్టుకునే రీతిలో ముస్తాబులు చేసి నిర్వహిస్తున్నారు. ఈ నేపధ్యంలో ఆదివారం ఉదయం తిరువాచ్చి ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం పల్లకిలో స్వామి అమ్మవార్లను ప్రతిష్టించి మేళ తాళాలు మంగళవాయిద్యాలతో గ్రామస్థులు వీక్షిస్తుండగా పల్లకి సేవ గ్రామంలోని నాలుగుమాడావీధుల్లో సాగింది. ఉత్సవంతో పాటు ఉభయదారులు మల్లవరం మునిచంద్రారెడ్డి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## అగ్నికి ఆహుతైన వేలాది కోడి పిల్లలు

### - షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం.. వాణియంబాడిలో ఘటన !!



కుప్పం, మే 26 ప్రభాతవార్త

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ కోళ్లఫామ్ షెడ్‌లో మంటలు చెలరేగగా వేలాది కోడి పిల్లలు అగ్నికి ఆహుతైన సంఘటన కుప్పం సరిహద్దుల్లోని తమిళనాడు రాష్ట్రం వాణియంబాడిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. వాణియంబాడి ప్రాంతానికి చెందిన రమేష్ అనే వ్యక్తి ఇటీవలే తన కోళ్లఫామ్ షెడ్‌కు సుమారు 3500 కోడి పిల్లలను తీసుకొచ్చి పెంచుతున్నాడు. అయితే ఏ ం జరిగిందో తెలియదు గానీ ఉన్నట్టుండి కోళ్లఫామ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఫామ్‌లోని కోడి పిల్లలు అన్నీ మృత్యువాత పడ్డాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేయగా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. షెడ్డు సైతం కాలి దగ్ధమైంది.



## ఆకట్టుకున్న సంకీర్తనలు

అన్నమాచార్య జయంతి సందర్భంగా కళాకారులు చేపట్టిన సంకీర్తనల గానం ఆహుతులను అలరించాయి.

ప్రభాతవార్త–తిరుపతి

## స్విమ్స్ రుయా ఆసుపత్రులను పరిశీలించిన సిఈఓ ఆరోగ్య శ్రీ ట్రస్టు డా.జి.లక్ష్మీ శ



తిరుపతి హెల్త్, మే 26, ప్రభాతవార్త

ఆరోగ్య శ్రీ ట్రస్టు సిఈఓ డా.జి.లక్ష్మీశ తిరుపతి జిల్లా స్విమ్స్ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ వార్డు, ఎమర్జెన్సీ ఐసియు వార్డు చికిత్స పొందుతున్న ఆరోగ్య శ్రీ రోగులను పరామర్శించారు. ఆరోగ్య శ్రీ సేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులు ఆరోగ్య శ్రీ సేవలు ఉచితంగా అందుతున్నాయని సిఈవోకి వివరించారు. అలాగే రేడియేషన్ థెరపీ ఆపరేషన్ థియేటర్ని సందర్శించి పని తీరు తెలుసుకున్నారు. జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, జిల్లా మేనేజర్ శివకుమార్ సిఈఓ వెంట ఉన్నారు. అలాగే ఆరోగ్య శ్రీ టీం లీడర్స్ పురం శ్రీనివాసులు, సమాది శ్రీనివాసులు, ఆరోగ్య మిత్రాలు పాల్గొన్నారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వి కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. రామ్, డాక్టర్ జయచంద్ర రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ ఆంకాలజీ అనంతరం సిఈఓ రుయా ఆసుపత్రిని సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న సర్జరీ రోగులను విచారించి రోగుల సమస్యలను అడగగా వైద్యం అంతా బాగా అందుతుందని రోగులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, డిప్యూటీ కలెక్టర్ భాస్కరనాయుడులు పాల్గొన్నారు.

## విఘ్నాలకు తొలగించి శుభాలునివ్వు స్వామీ

### -వినాయకునికి చతుర్థశి పూజలు





తిరుపతి,మే 26ప్రభాతవార్త:

విఘ్నాలు తొలగించి శుభాలు కలిగించు స్వామీ అని వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ఆదివారం సాయంత్రం వరసిద్ధివినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం సంకటహర చతుర్థశి సందర్భంగా వినాయకసాగర్‌లోని వరసిద్ధివినాయకునికి కమిటీ నిర్వాహకులు గుండాల గోపీనాథరెడ్డి, సురేష్‌స్వామి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, డిపి ఆనంద్, వాసు, చెంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, విజయలక్ష్మి, శాంతి ,వాసుదేవరెడ్డి పాల్గొని వినాయకునికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరిజలం, పంచామృతం, చందనం అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. సంకటహరచతుర్థశి వినాయకునికి ఎంతో విశిష్టమైన రోజుఅని, వినాయకచవితితో సమానమైన ఘడియలు అని అర్చకులు పేర్కొన్నారు. ఈ రోజు వినాయకుడిని దర్శించుకుంటే అన్నీ శుభాలు కలుగుతాయని తెలిపారు.

## రాజగోపురం కూలటం ఓ చేదు జ్ఞాపకం

శ్రీకాళహస్తి,మే 26 ప్రభాతవార్త



*శ్రీకాళహస్తికి రాజమకుటుంలా సుమారు 500 సంవత్సరాల పాటు మన్నిక, గుర్తింపు పొందిన శ్రీకృష్ణదేవ రాయలచే నిర్మించిన 'రాజగోపురం' 2010 మే 26 రాత్రి 8 గంటల సమయంలో కుప్పకూలటం ఓ చేదు జ్ఞాపకంగా శ్రీకాళహస్తి ప్రజలు భావిస్తారు. రాయల సీమను రతనాల సీమగా పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయలు తన విజయయాత్రలో భాగంగా శ్రీకాళహస్తికి వచ్చినప్పుటికే ఆలయ నిర్మాణం పూర్తి అయ్యిందని చెబుతారు. అప్పుడు తన విజయయాత్రకు చిహ్నంగా ఓ చారిత్రాత్మక కట్టడాన్ని కట్టదలచిన కృష్ణ దేవరాయలు ఇక్కడ 136 అడుగుల ఎత్తులో రాజగోపురాన్ని నిర్మించినట్లు చెబుతారు. 1516లో రాజగోపురం నిర్మాణం పూర్తి అయినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. అయితే ఈ మహాకట్టడం 1984 నుంచి శిధిలావస్థకు చేరుకోవటం మొదలైంది. 2010లో చెన్నై ఐఐటికి చెందిన నిపుణులు పరిశీలించి ఏ క్షణంలో అయినా కూలవచ్చునని నిర్ధారించారు. రెండవ రోజూ రాత్రియే కుప్పకూలింది. తరువాత ప్రస్తుత రాజగోపురాన్ని నవయుగ కన్‌స్ట్రక్షన్స్ కుచెందిన చింతా విశ్వేశ్వరయ్య రూ.65కోట్లు వెచ్చించి నిర్మించారు. ఓ చారిత్రక కట్టడం కూలటం దురదృష్టకరం.*

## ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు లక్ష్యంగా విధులు

### - చిత్తూరులో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

చిత్తూరు, మే 26 ప్రభాతవార్త:

ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా పక్కా చర్యలు తీసుకోవడానికి పోలీసు యంత్రాంగం చిత్తూరు నగర పరిధిలో పెద్ద ఎత్తున ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రజల్లో ధైర్యంను నింపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు చిత్తూరు డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ విశ్వనాథరెడ్డి, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ ఉలసయ్య, చిత్తూరు వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రవిశంకర్‌రెడ్డి, ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కుల్లయ్యప్పల సమక్షంలో ఆదివారం ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, ఎస్టీఎఫ్ సిబ్బంది, 70 మంది కేంద్ర బలగాలు, ఒక వజ్రా వాహనంతో నగరంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ చిత్తూరు గాంధీ సర్కిల్ నుండి ప్రారంభమై కోర్టు కాంప్లెక్స్, తోటపాళ్యం, పొన్నియమ్మన్ కోవిల్ స్ట్రీట్, ఎంఎస్ఆర్ సర్కిల్, దర్గా సర్కిల్, లలూ గార్డెన్, టాప్‌లైన్, చర్చివీధి మీదుగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వరకు సాగింది. ఈ ఫ్లాగ్ మార్చ్ అనంతరం ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటన విడుదల చేస్తూ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ఎలా జరిగిందో అదే తరహాలో ఓట్ల లెక్కింపు సైతం ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందన్నారు.

## కాణిపాకంలో వైభవంగా సంకటహర గణపతివ్రతం

### -కిక్కిరిసిన ఆస్థానమండపం



కాణిపాకం, మే 26 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఆదివారం సంకటహర గణపతివ్రతంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం చతుర్థి రోజున ఈవ్రతంను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు దేవస్థానం ఆస్థాన మండపంలో అర్చకులు ఈ వ్రతాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయం నుండి అలంకరించిన సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ స్థానిక ఆస్థాన మండపంకు తీసుకువచ్చి వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు దఫాలుగా ఈవ్రతాన్ని నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం తరపున తీర్థప్రసాదములను అందజేశారు. పవిత్రమైన సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించుకోవడానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలిరావడంతో ఆస్థాన మండపం కిక్కిరిసింది. దీనితో ఆలయ అధికారులు, సిబ్బంది భక్తులకు కావలసిన ఏర్పాట్లు చేపట్టారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటేశు, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## పోలీసుల కార్డెన్ అండ్ సెర్చ్



చిత్తూరు, మే 26 ప్రభాతవార్త:

ఓట్ల లెక్కింపు సమీపిస్తుం డటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకో కుండా పోలీసు యంత్రాంగం ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా కార్డెన్ అండ్ సెర్చ్‌కు శ్రీకారం చుట్టింది. ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు జిల్లాలోని డిఎస్పీల పర్యవేక్షణలో ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది కలిసి ఆదివారం ఉదయం 5 గంటల నుండి 7.30 గంటల వరకు పల్లెల్లో విస్తృతంగా గాలింపులు చేపట్టారు. అక్రమంగా దాచి వుంచిన ఆయుధాలు, పేలుడు పదర్థాలు, బాణాసంచా, పెట్రోల్, డీజిల్, మాదకద్రవ్యాలు, సరైన పత్రాలు లేని అనుమానిత వాహనాలను సీజ్ చేయడానికి ఈ కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమంను పోలీసులు నిర్వహిస్తుంటారు. చిత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని చిత్తూరు వన్‌టౌన్, టుటౌన్ స్టేషన్ల పరిధిలోని శంకరయ్యగుంట, బాలాజీనగర్‌ల్లో నిర్వహించిన కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో పోలీసులకు సరైన పత్రాలు లేని ఏడు ద్విచక్రవాహనాలు, ఒక ఆటో పట్టుపడటంతో వీటిని పోలీసులు సీజ్ చేశారు. అలాగే చిత్తూరు వెస్ట్ సర్కిల్ పరిధిలోని గుడిపాల మండలం రాసనపల్లి గ్రామంలో పోలీసులు నిర్వహించిన కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో పత్రాలు లేని నలుగు ద్విచక్రవాహనాలను పోలీసులు సీజ్ చేశారు. అలాగే ఇక్కడ 600 లీటర్ల ఎఫ్‌జె వాష్‌ను పోలీసులు ధ్వంసం చేశారు. కల్లూరు సర్కిల్ పరిధిలో ఐరాల మండలం విఎస్ అగ్రహారం, అరుణ్‌నగర్ కాలనీల్లో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించగా సరైన పత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలు పట్టుబడటంతో పోలీసులు వాటిని సీజ్ చేశారు. అలాగే సదుం పోలీస్ స్టేషన్ పరిధిలోని చీకలచేను, సిఎం గొల్లపల్లి, గాదేవారిపల్లి గ్రామాల్లో జరిగిన కార్డెన్ అండ్ సెర్చ్‌లో సరైన పత్రాలు లేని రెండు ద్విచక్రవాహనాలను పోలీసులు సీజ్ చేశారు. పలమనేరు సర్కిల్ పరిధిలో ముదివారిపల్లిలో నిర్వహించిన కార్డెన్ అండ్ సెర్చ్‌లో ఆరు ద్విచక్రవాహనాలను పోలీసులు సీజ్ చేశారు. అలాగే కరిడిమడుగు కొండ ప్రాంతంలో 200 లీటర్ల నాటు సారా ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. అలాగే నగరి అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సీ కాలనీలో నిర్వహించిన కార్డెన్ అండ్ సెర్చ్‌లో పోలీసులు 15 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు.

# రద్దీ రోజుల్లో కూడా కొరవడిన పర్యవేక్షణ!

## దళారుల చేతికి అప్పగించిన ఆలయం

శ్రీకాళహస్తి,మే 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో రద్దీ రోజుల్లో కూడా పర్యవేక్షణ కొరవడింది. సాధారణంగా ఆదివారం ఆలయానికి రద్దీ వేలల్లో ఉంటుంది. రెండు రోజులుగా ఆలయానికి పాతిక వేలకుమందికి పైగా వస్తున్నారు. ఓ వైపు భక్తుల రద్దీ మరో వైపు విఐపిల తాకిడి. ఇలా ఆదివారం ఆలయం భక్తులతో కిట కిట లాడింది. ఇక సోషల్ మీడియాలో దళారుల దందా గురించి వరుస కథనాలు వస్తున్నాయి. అంతేకాక దళారులు పరిత్యగించి వ్యవహారిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఆలయాధికారులు ఏమో అది బయట జరుగుతుంది? మనకేమి సంబంధం? అన్నట్లు వ్యవహారించటంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. పాలకులు అభాసుపాలౌతున్నారు.

**తట్టల్లో వసూళ్ళు:సంభావనలతో బేజారు . . .**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాహుకేతుదోష నివారణ పూజల్లో ముక్కుపిండి భక్తుల వద్ద వసూళ్ళు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఓ వైపు దళారులు,మరో వైపు ఆలయంలోపూజలు చేసే వారు ఎవరికి వారు భక్తులను చెప్పకనే నిలువుదోపిడి చేస్తున్నారనే ఆవేదన భక్తుల్లో చోటు చేసుకుంది. రాహుకేతుదోష నివారణ పూజల్లో వసూళ్ళు ఆగాయా? అంటే ఆ ముక్కంటీశునికే ఎరుక. ఆలయానికి వచ్చే 3గేట్ల వద్ద కార్‌పార్కింగ్‌ల వద్ద దళారుల దోపిడి విచ్చలవిడిగా మారింది. కానీ పట్టించుకునే దిక్కులేదు. పాలకులేమో ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పట్టించుకో లేదు. ఆలయంలో పాలకుల తప్పిదంతో వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ధర్మకర్తల మండలి ఉన్నా దళారులను కట్టడి చేసే స్థితి లేదు. ఏ దళారి ఎవరి చే నియమింపబడ్డారో ముక్కంటీశునికే ఎరుక. ఆదివారంకార్లు వాహనాలకు పార్కింగ్ స్థలం చాలక వంతెనల మీద, పొన్నాలమ్మగుడి వరకు పార్కింగ్ చేసుకున్నారు. అలాగే శుకబ్రహ్మాశ్రమం వరకు నిలుపుకున్నారు. ఎటు చేసినా వాహనాలే అన్నట్లు మారింది.



**రికార్డు స్థాయిలో పూజలు:**

ఆదివారం రాహుకేతుదోష నివారణ పూజలు సుమారు 5 వేలు జరిగాయి.,ఇకప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు ద్వారా మరో ఆరువేల మంది ప్రవేశించారు. సుమారు 30వేల మందికి పైగా ప్రవేశించినట్లు సమాచారం. ప్రసాదాలు సుమారుపాతిక వేలు అమ్మకాలు జరిగాయి. అభిషేకాలు 94 జరిగినట్లు అధికారులు ప్రకటించారు. చండి హోమాలు కూడా 3 జరిగాయి. అయితే రద్దీ రోజుల్లో కట్టుదిట్టమైన వ్యవస్థ అవసరం. సామాన్య భక్తులు గంటల కొద్ది క్యూలైన్లలో నిరీక్షిస్తుంటే దర్జాగా దళారులు, విఐపిలంటూ పాలకులు వెళుతుంటే సామాన్యభక్తులు మౌనం వహిస్తారా? తిరుగబడతారు. ఆలయంలో భక్తుల సౌకర్యార్థం పటిష్టమైన వ్యవస్థ ఎంతైనా అవసరం. ఇప్పటికైనా గాడితప్పిన పాలనకు సంబంధించి పాలకులు స్పందించకుంటే ఆ ప్రభావం పాలనపై పడుతుందనే సత్యాన్ని విస్మరించరాదు.